సోమవారం 26 మే 2025 5 అనంతపురం



వేరుశనగ విత్తనకాయల ధర ఖరారు

40 శాతం సబ్సిడీతో పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వేరుశనగ విత్తనకాయల అమ్మకం ధర ఖరారైంది. గతేడాది కంటే స్వల్పంగా తగ్గించి ధరను నిర్ణయించారు. గతేడాది క్వింటాళు అమ్మకం ధర రూ.9500 కాగా ఈసారి అది రూ. 9300గా నిర్ణయించారు. అమ్మకం ధరపై 40 శాతం సబ్సిడీని నిర్ణయించారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులకు అయితే 90 శాతం సబ్సిడీ ఉండనుంది. ఇప్పటికే విత్తన సేకరణ శుద్ధి ప్రక్రియ నడుస్తోంది. అమ్మకం ధర ఖరారు కావడంతో నిలువను బట్టి పంపిణీ తేదీలు ఖరారయ్యే అవకాశముంది.

సబ్సిడీ ధరలు :జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 50592 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనకాయలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందులో కె-6 రకం క్వింటాళు అమ్మకం ధర రూ.9300 కాగా సబ్సిడీ రూ.3720 పోనూ అమ్మకం ధర రూ.5580 కానుంది. టిసిజిఎస్ 1694, టాగ్ 224 ధరలు కూడా ఇదే తీరు ఉంది. నారాయణి రకం మాత్రం క్వింటాళు అమ్మకం ధర రూ.9500 ఉండగా సబ్సిడీ రూ.3800 పోనూ అమ్మకం ధర రూ.5700గా నిర్ణయించారు. కదిరి-లేపాక్షి 1812 రకం క్వింటాళు ధర రూ.8200 కాగా సబ్సిడీ రూ.3280 పోనూ రైతు చెల్లించాల్సింది రూ.4920గా ఉంది.

గరిష్టంగా మూడు బస్తాలు : వేరుశనగ విత్తనకాయల సబ్సిడీతో 30 కిలోల బస్తాలివ్వనున్నారు. ఈ మేరకు అర ఎకరంలోపు భూమి ఉన్న రైతుకు ఒక బస్తా ఇవ్వనున్నారు. అర ఎకరం కంటే ఎక్కువ ఉండి ఎకరాలోపు ఉంటే రెండు బస్తాలిస్తారు. ఒక ఎకరం కంటే ఎంత ఎక్కువ భూమి ఉన్నా గరిష్టంగా మూడు బస్తాలకే పరిమితం చేశారు.

రైతు ప్రయివేటుపై ఆధారపడక తప్పదు : జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ పంట 4.49 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు ఇంత విస్తీర్ణంలో పంట సాగయితే వేరుశనగ విత్తనకాయలు మూడు లక్షల క్వింటాళ్ల వరకు అవసరమవుతుంది. కాని ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది కేవలం 50,592 క్వింటాళ్లు మాత్రమే . తక్కిన విత్తనాన్ని రైతు బహిరంగ మార్కెట్‌లోనే కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఎందుకంటే ఒక ఎకరంలో వేరుశనగ విత్తనం వేయాలంటే తక్కువలో తక్కువ 40 కిలోల వరకు విత్తనం అవసరమవుతుంది. ఈ లెక్కన 4.49 లక్షల ఎకరాల్లో విత్తనం వేయాలంటే 1.79 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనం అవసరం. దీని ప్రకారం విత్తనకాయలు మూడున్నర లక్షల క్వింటాళ్లు అయినా కావాలి. అయితే ప్రభుత్వమిస్తున్నది కేవలం 50592 క్వింటాళ్లు మాత్రమే. తక్కిన విత్తనకాయలను రైతులు బయట కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

సబ్సిడీ పెంచాలి



వేరుశనగ రైతుకు ప్రభుత్వపరంగా ప్రోత్సహం మరింత అందివ్వాలి. 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని రైతు సంఘంగా ముందు నుంచి అడుగుతున్నాం. ఇప్పుడూ అదే డిమాండ్ చేస్తున్నాం. అదే విధంగా విత్తనకాయలను 90 కిలోలకు కాకుండా అవసరమైన మేరకు అందివ్వాలి. అప్పుడే రైతుకు కొంత ఊరట లభిస్తుంది. లేకపోతే పెట్టుబడులు పెరిగి రైతుపై అదనపు భారం పడే అవకాశముంది.

చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

బలవంతపు భూసేకరణపై రైతుల్లో వ్యతిరేకత



తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతులు, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరదిలోని మలగూరు గ్రామంలో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ రెడ్డికి పిత్రార్జితం కింద 12 ఎకరాల భూమి ఉంది.ఈ భూమిలో వ్యవసాయం చేసుకుంటు అతని ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. ప్రస్తుతం ఉన్న భూమి మొత్తం భూసేకరణ పేరుతో ప్రభుత్వం లాక్కొనేందుకు పూనుకుంది. దీంతో చంద్రశేఖర్ రెడ్డి కుటుంబం రోడ్డున పడబోతోంది.

హిందూపురం రూరల్ మండల పరదిలోని మలగూరు గ్రామంలో నివాసం ఉంటున్న దళిత కుటుంబానికి చెందిన నరసింహ్మాప్పకు ఐదుగురు సంతానం. ఇతనికి 3 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో బోరు బావి ద్వారా సంవత్సరానికి మూడు పంటలు పండిస్తు జీవనం చేస్తున్నాడు. ఇప్పుడు ఈ మూడు ఎకరాలు మొత్తం ప్రభుత్వం తీసుకుంటోంది.

అదే గ్రామానికి చెందిన ఈడిగ శ్రీరాములుకు 5ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో అప్పులు చేసి వివిధ పంటలు పండించి, అమ్మగా వచ్చిన దాంతో ఇతని నలుగురు కుమార్తెలకు వివాహం చేశాడు. వివాహ సమయంలో అందిన కాటికి అప్పులు చేశాడు. తనకు ఉన్న భూమిలో వ్యవసాయం చేసి అప్పులను తీర్చుదామనుకున్నాడు. అయితే ఉన్నా ఫళంగా ప్రభుత్వం ఉన్నా భూమిని స్వాదీనం చేసుకోవడానికి సిద్ధం కావడంతో చేసిన అప్పులను ఏలా తీర్చాలో తెలియక మధన పడుతున్నాడు. ప్రభుత్వం తన భూమిని తీసుకుంటే తనకు ఆత్మహత్య శరణ్యం అంటున్నాడు. ఇలా ఒక్క చంద్రశేఖర్ రెడ్డి, దళిత నరసింహ్మప్ప, శ్రీరాములే కాదు ఎ హిందూపురం, లేపాక్షి, సోమందేపల్లి మండల పరదిలో ఉన్నా దాదాపు 8 గ్రామాలకు చెందిన 1118 చిన్న, సన్న కారు రైతుల ఆవేదనలు ఇవి.

1118 మంది రైతుల నుంచి 2191 ఎకరాల సేకరణకు రంగం సిద్ధం
బలవంతపు భూసేకరణ ఎవరి కోసం అంటున్న రైతన్నలు
రైతులతో కలిసి ఆందోళనలు తీవ్రం చేస్తామంటున్న రైతు సంఘం నాయకులు

ప్రభుత్వం హిందూపురంలో బలవంతపు భూసేకరణకు శ్రీకారం చుట్టింది. హిందూపురం రూరల్ మండలం మలగూరు రెవెన్యూ పొలం పరిధిలో ఉన్న మలగూరు, చలివెందుల, రాచపల్లి, లేపాక్షి మండలం కొండూరు, సోమందేపల్లి మండలం నడింపల్లి తదితర గ్రామాల పరిధిలో దాదాపు 1118 మంది రైతులకు చెందిన 2191 ఎకరాల భూమిని భూ సేకరణ చట్టం ద్వారా సేకరించాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ భూమిని దేని కోసం సేకరిస్తున్నారు, ఎవరి కోసం సేకరిస్తున్నారన్న విషయాలను భూసేకరణ చట్టం అనుసరించి రెవిన్యూ అధికారులు గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేసి రైతులకు వివరించాల్సి ఉంది. ప్రభుత్వం చెప్పిన వెంటనే అధికారులు నిబంధనలకు పాతర వేసి భూసేకరణకు సిద్ధం అయ్యారు. సంవత్సరానికి మూడు పంటలు పండించే భూములను ప్రభుత్వం భూ సేకరణ చట్టం అనే అస్త్రాన్ని ఉపయోగించి స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమైంది. ఈ భూసేకరణ అంబాని కోసమా...?, ఆదాని కోసమా...? అన్నది అర్థం కావడం లేదు. ప్రభుత్వం చెప్పింది, తాము భూమిని సేకరిస్తున్నామంటూ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికే హిందూపురం నియోజక వర్గంలో వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. అయితే ఇప్పటి వరకు సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. భూములు ఇచ్చిన రైతులు రోడ్డు పాలయ్యారు. భూములన్ని బీడు భూములుగా మారాయి. ఈ నేపథ్యంలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించడానికి రైతు సంఘాల నాయకులు సిద్ధమవుతున్నారు.

పేదల దరిచేరని 2013 భూసేకరణ చట్టం

బ్రిటిష్ వాళ్ల రూపొందించిన భూ సేకరణ చట్టం 'ల్యాండ్ అక్విజిషన్ యాక్ట్-1894' కి మనకు స్వాతంత్ర్యం సిద్ధించాక రెండు మూడు చిన్న సవరణలు జరిగినప్పటికీ 'భూసేకరణ చట్టం-2013' వచ్చే వరకు దాదాపు 120 సంవత్సరాలు అదే అమల్లో ఉంది. ఈ భూసంతర్పణను వ్యతిరేకిస్తూ చాలా ఏళ్ళ నుంచి ఎందరో శాసనకర్తలు, న్యాయాధీశులు, రైతు సంఘాలు, హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు విజ్ఞప్తులు చేశాయి. ఇంకా సమకాలీన అవసరాల దృష్ట్యా గత యూపీఏ ప్రభుత్వం రెండవ సారి ఎన్నికైన తర్వాత అంటే 2013లో కొత్త భూ సేకరణ చట్టం రూపుదిద్దుకుంది. ఈ కొత్త చట్టానికి హక్కు అనే పదం జోడించి 'భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణం, న్యాయమైన పరిహారం, పారదర్శకత 2013 చట్టం'గా తయారు చేసారు. ఇది జనవరి 2014 నుంచి అమలు పరిచేలా కేంద్రం నిర్ణయించింది. ఈ చట్టాన్ని రూపొందించి 12 సంవత్సరాలు గడుస్తున్నా నేటికి అది పేదల దరిచేరలేదు. ప్రభుత్వం పేదల బాధలను వినకుండానే చట్టాన్ని చుట్టంగా మార్చుకుని భూములను సేకరిస్తోంది.

రైతులతో కలిసి ఉద్యమిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూసేకరణకు వ్యతిరేకంగా పంజాబ్ రైతులు చేసిన ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమిస్తాం. ఏడాదికి మూడు పంటలు పండే 2191 ఎకరాల భూమిని భూ యజమానులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఎలా తీసుకుంటున్నారు. భూ సేకరణ చట్టాన్ని అనుసరించి భూమిని సేకరించాలంటే గ్రామాల్లో రైతులతో సమావేశాలను ఏర్పాటు చేసి, సేకరించిన భూముల్లో ఫలానా పరిశ్రమలు వస్తున్నాయని వివరించి, రైతులకు ఇష్టముంటేనే భూమిని సేకరించాలి. చట్టాలను ఉల్లంఘించి బలవంతపు భూసేకరణ చేయడం ఎంతవరకు న్యాయం.

సిద్దారెడ్డి,
రైతు సంఘం నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నియోజకవర్గ పరిధిలోని శెట్టూరు మండల సరిహద్దులోని ఓ దాబా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. కళ్యాణదుర్గానికి చెందిన చికెన్ సెంటర్ నిర్వాహకులు రామకృష్ణ కుమారుడు కళ్యాణ్, అతని స్నేహితుడు బోయ శ్రీనివాసులు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా శెట్టూరు మండల సరిహద్దు కర్ణాటకలోని శిరువలంలో ఉన్న నందిని డాబా వద్ద ద్విచక్ర అదుపుతప్పి కింద పడింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో శెట్టూరు మండల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మృతిచెందిన యువకులు



ఎంపికి వినతిపత్రం అందజేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

పోస్టల్ శాఖ ద్వారా విస్తృతంగా సేవలు అందించి అభివృద్ధికి నాంది కావాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం నగరంలో ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ 8వ వార్షికోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖ అనేది గ్రామీణ జీవనశైలిలో మమేకమై ఉందన్నారు. సేవాధారిత శాఖ, బ్యాంకింగ్, కమ్యూనికేషన్, లావాదేవీలు వంటి ఎన్నో విభాగాల్లో విస్తృతంగా సేవలు అందిస్తోందన్నారు. పోస్టల్ ఉద్యోగుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం అన్నారు. పోటీ యుగంలో పోస్టల్ శాఖను టెక్నాలజీతో సమన్వయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం... నీట మునిగిన వేరుశనగ పంట

ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న బాధిత రైతు

ప్రజాశక్తి - అనంతపురం, ఉరవకొండ

ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో పతకమూరు శ్రీనివాసులు అనే రైతుకు చెందిన ఐదు ఎకరాల వేరుశెనగ పంట కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నీట మునిగింది. హంద్రీనీవా కాలువ ఆధునీకరణలో భాగంగా కాలువలో ఉన్న నీటిని కాంట్రాక్టర్ పక్కనున్న భూమిలోకి వదిలాడు. దీంతో సంబంధిత రైతు తన ఐదు ఎకరాల పొలంలో సాగుచేసి వేరుశనగ పంట నీట మునిగింది. అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరుతున్నాడు. ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో పతకమూరు శ్రీనివాసులు అనే రైతుకు సర్వే నంబర్ 282-1లో 14.82 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో రైతు 5 ఎకరాల్లో టాగ్ -24 అనే రకం వేరుశెనగ సాగు చేశారు. శ్రీనివాస్ పొలానికి సమీపంలో హంద్రీనీవా కాలువ వెళుతుంది. ప్రస్తుతం కాలువ విస్తీరణ పనులు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు హంద్రీనీవా కాలువలోకి నీరు అధికంగా చేరింది. పనులకు ఇబ్బంది కలుగుతుందని భావించిన కాంట్రాక్టర్ ఎలాంటి ముందు చూపు లేకుండా శ్రీనివాసులకు చెందిన భూమిలోకి నీటిని వదిలాడు. వేరుశెనగ సాగులో ఉన్న విషయం తెలిసినా పొలంవద్ద కాలువకు గండి కొట్టి పొలంలోకి నీరు వదిలారు. ఫలితంగా 5 ఎకరాల వేరుశెనగ పంటతో పాటు బావికూడామునిగి పోయింది. దీంతో రైతుకు దాదాపుగా మూడు లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లింది. కాంట్రాక్టర్ అనాలోచిత చర్యవల్ల తాను తీవ్రంగా నష్టపోయానని తనను ఆర్థికంగా అదుకోని నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు శ్రీనివాసులు కోరుతున్నాడు. తన భూమిలో పంట ఉందని తెలిసినా కాంట్రాక్టర్ ఎలాంటి ముందుచూపు లేకుండా నీటిని వదిలాడని బాధిత రైతు విమర్శించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఫలితంగా ఐదు ఎకరాలను వేరుశనగ పంట నాశనమైందన్నారు. పెట్టిన పెట్టుబడి, పంటలు కాపాడుకోవడానికి చేసిన శ్రమ అంతా నీటిపాలైందన్నారు. అధికారులు, పాలకులు స్పందించి తనను ఆదుకోవాలని రైతు శ్రీనివాసులు కోరుతున్నాడు.

కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి : ఎపి రైతుసంఘం

రైతు శ్రీనివాసులుకు నష్టం చేసిన హంద్రీనీవా కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని బాధితరైతుకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి,రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శులు మధు, విరుపాక్షి మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా రైతు శ్రీనివాసులు పొలం వద్దే గండికొట్టి కాలువ నీరు పొలంలోకి వదిలాడన్నారు. దీని వల్ల రైతు సాగుచేసిన 5 ఎకరాల వేరుశెనగ పంట నీట మునగడంతో పాటు బావి కూడా నీట మునిగిందన్నారు. రైతుకు దాదాపు మూడు లక్షల రూపాయలకు పైగా నష్టం వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఇందుకు బాధ్యులైన కాంట్రాక్టర్ ,ఇంజినీర్ల పై తగిన చర్యలు తీసుకొని రైతుకు నష్టం పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు.



నీటమునిగిన వేరుశనగ పంట

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - నార్పల

మండల పరిధిలోని సబ్‌స్టేషన్ కింద మరమ్మతులు చేస్తున్న దృష్ట్యా సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఎఇ నీలకంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమణించి సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటో ఉంటే రోడ్డుమీద పడేస్తాం

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటో ఉంటే రోడ్డుమీద పడేస్తామని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజు అన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రాజకీయంగా సమాధి అయిన వైసిపికి చెందిన నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు చిన్న చిన్న విషయాలను పెద్దవి చేసి, తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి వద్ద మెప్పు పొందాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా జగన్ ఫొటో ఉంటే రోడ్డుమీద పడేస్తామని అన్నారు. తామెక్కడా జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మను అవమానించలేదన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ కూర్చొనే కార్యాలయం ప్రభుత్వ కార్యాలయమని అక్కడ జగన్‌ఫొటో ఉండటంపై సిఇఒను నిలదీస్తే వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు తప్పుగా అనిపించిందా అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ రంగయ్యకు పార్టీ కార్యాలయానికి, ప్రభుత్వ కార్యాలయానికి తేడా తెలియదా అని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా జగన్ ఫోటోలు ఉంటే దానికి సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలు ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని మొదటి క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసి, ప్రభుత్వ కార్యాలయాలకు నోట్ పంపిస్తే అమలు చేయాల్సిన బాధ్యత జెడ్పీ సీఈఓకు ఉండదా? అని నిలదీశారు. జెడ్పీ కార్యాలయంలో ఏం జరిగిందో మరోసారి పరిశీలించి మాట్లాడాలని హితవు పలికారు.




విలేకర్లతో మాట్లాడుతున్న ఎంఎస్.రాజు

పండ్లతోటల సాగుకు ముందుకు రండి

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎర్ర నేలలు అధిక శాతంలో ఉన్నందున పండ్ల మొక్కల పెంపకానికి అనుకూలంగా ఉంటుందని అందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో గత పది ఏళ్లుగా అతివృష్టి అనావృష్టి వల్ల తరచూ రైతులు పంటలు పెట్టి నష్టపోతునే ఉన్నారు. ప్రధానంగా వేరుశనగ పంటపై ఆధారపడడం వల్ల వర్షాభావ పరిస్థితులతో ఏటా పంటలు దెబ్బ తినడం తద్వారా అప్పులు పెరిగిపోవడం అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడడం చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో వ్యవసాయం చివరకు ఒక జూదంలా మారిపోయింది. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా పంటల మార్పిడి వల్ల కొంతమేర రైతులకు ఉపయోగమని వ్యవసాయ ఉద్యానవన శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం కూడా అనేక రాయితీలు ఇస్తోంది. ముఖ్యంగా జిల్లాలో ఇటీవల పండ్ల తోటలు పెంపకానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. అందుకు అనుకూలంగా డ్రిప్పు, స్పింక్లర్లను సబ్సిడీపై అందిస్తూ రైతులను ప్రోత్సహిస్తోంది. తక్కువ తడులతో నీరు వృథా కాకుండా ఈ పరికరాలు ఉపయోగపడతాయి. ఈ నేపథ్యంలో పండ్ల తోటలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, రాయితీల ప్రోత్సాహం తదితర అంశాలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో వెల్లడించారు.



ప్రశ్న: జిల్లాలో ఏయే పండ్ల మొక్కల పెంపకం చేపట్టవచ్చు? ప్రస్తుతం సాగు విస్తీర్ణం ఎంత?

జవాబు : జిల్లాలో ఎక్కువ శాతం ఎర్ర నేలలు ఉండడంతో పండ్లతోటల పెంపకానికి అనుకూలంగా ఉంది. మామిడి, చీని, దానిమ్మ, సపోటా, అరటి, బొప్పాయి, ద్రాక్ష, అంజూర పండ్ల మొక్కలు పెంచుకోవచ్చు. కాయలు వచ్చేవరకు పంటల మధ్య అంతర్ పంటలు కూడా సాగు చేయవచ్చు. జిల్లాలో మొత్తం 1699.22 హెక్టార్లలో పండ్ల మొక్కలు పెంపకం లక్ష్యం కాగా ఇప్పటివరకు 1579.50 హెక్టార్లలో పెంపకం జరుగుతోంది.1524 మంది రైతులు లబ్ధి పొందారు.

ప్ర: నీటి వనరులు కల్పించడానికి చేపడుతున్న చర్యలు ఏమిటి?

జ: ప్రభుత్వం అనేక పథకాల ద్వారా నీటి వనరులు పెంపొందించేందుకు తగిన సౌకర్యాలు కల్పిస్తోంది. అందులో ఒకటైన డ్రిప్ ఇరిగేషన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తమ శాఖ ద్వారా చిన్నపాటి కుంటలు, ఫారం ఫండ్స్ ఏర్పాటుకు ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఫారం ఫండ్స్ లక్ష్యం 33 చోట్ల కాగా రూ. 82.5 లక్షలతో ఆ 33 చోట్ల ఫారం ఫండ్స్ నిర్మించడం జరిగింది. దీంతో 33 మంది రైతులు లబ్ధి పొందారు.

ప్ర : మీ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు ఏమిటి?

జ : జిల్లాలో పండ్ల తోటల విస్తరణ అనంతరం రెండు మూడు సంవత్సరాల తర్వాత రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించడం జరుగుతుంది. నీటి వనరుల ఏర్పాటుకు తగు చర్యలు చేపడుతున్నాం. పండ్ల కోతలు అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు రైతులకు వివరిస్తున్నాం. అందులో భాగంగానే రైతులకు తగిన శిక్షణను కూడా ఇవ్వడం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి అందే డ్రిప్పు, స్పింక్లర్ల గురించి, అవి వాడే విధానం గురించి వివరిస్తాం. సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం ద్వారా రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ సబ్సిడీలు కూడా అందిస్తాం.

ప్ర : జిల్లాలో ఎంత మంది రైతులకు లబ్ధి చేకూరింది?

జ : జిల్లాలో పండ్ల తోటల పెంపకం ఇతర సదుపాయాలు ద్వారా 5100 మంది రైతులు లబ్ధి పొందారు. ఆర్థికంగా రూ.564.53 లక్షలు వివిధ రకాలుగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారు. అలాగే హైబ్రిడ్ కూరగాయల పంటల ద్వారా కూడా రైతులు లబ్ధి పొందుతున్నారు.

ప్ర : రైతులకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పండ్ల తోటల రైతులకు ఎంతో ఉపయోగం. కొత్తగా ఉద్యానవన పంటలు పెట్టే వారికి గుంతలు తవ్వుకోవడానికి ఈ వర్షాలు అనుకూలంగా ఉన్నాయి. రైతులు ముందుకు వచ్చి ఉద్యానవన మొక్కలు నాటుకుంటే రాబోయే జూన్, జూలైలో కురిసే వర్షాలు రైతులకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఒకే రకమైన పంటలు ద్వారా కాకుండా పండ్ల మొక్కలు పెంపకం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను రైతులు అందిపుచ్చుకొని అభివృద్ధి చెందాలి. కొన్ని మొక్కలకు రెండు మూడు రోజులకు ఒకసారి మరికొన్ని మొక్కలకు వారానికి ఒకసారి నీటి తడులు అందించే విధంగా ఉంటాయి. రైతులు నీటి లభ్యతను బట్టి పెంచుకోవచ్చు. డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు అయితే 90 శాతం సబ్సిడీతో ఇతర రైతులకు 50 శాతం సబ్సిడీతో పరికరాలు అందించడం జరుగుతుంది. చెట్లు తెగుళ్ల బారిన పడకుండా నూతన యాజమాన్య పద్ధతులు అవలంభిస్తూ అభివృద్ధి చెందాలి.



జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి. చంద్రశేఖర్

నిధులున్నా.. అభివృద్ధి సున్నా..!

రోడ్లపై చెత్తకుప్పలు..- వెలగని వీధిలైట్లు -సమస్యల వలయంలో నెలకొండ గ్రామం



నెలకొండ గ్రామంలో రోడ్డుపై పారుతున్న నీరు, ఇన్‌సెట్‌లో నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని నెలగొండ గ్రామంలో అధికారుల నిర్లక్ష్యంతో పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో సిసి రోడ్లు పాచిపట్టి పోయాయి. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో గ్రామంలో అపరిశుభ్రతతోపాటు వాటర్ ట్యాంకు సైతం శుభ్రం చేయడకపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సాక్షాత్తు సర్పంచ ఇంటి ముందు ఉన్న మురికికుంటను శుభ్రం చేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు లేని కారణంగా అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ అభివృద్ధికి పుష్కలంగా నిధులు ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైందన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. తాగునీటి ట్యాంకును ఆరునెలలకు శుభ్రం చేయకపోవడంతో పాచి పట్టి నీరు దుర్వాసన వెదజల్లుతోంది. పాచి పట్టిన సీసీ రోడ్లలో జారి కింద పడుతూ గాయాలపాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి సమస్య తీర్చాలని, విద్యుత్ దీపాలు వేసి పారిశుధ్య పనులు నిర్వహించాలని సర్పంచ పాటిల్ భాగ్యమ్మను ప్రజలు కోరితే 'గతంలో చేసిన బిల్లులే ఇవ్వడం లేదు.. ఇక కొత్త పనులు ఎలా చేసేది' అంటూ తెగేసి చెబుతున్నట్లు సమాచారం. గతంలో చేసిన పనులకు లక్షల్లో బిల్లులు రావాల్సి ఉందని సర్పంచ చెబుతోంది. ప్రస్తుతం పంచాయతీలో రూ.4.36లక్షల నగదు ఉండగా వీటిలో కేవలం గ్రీన్ అంబాసిడర్ జీతాలు మాత్రమే ఇస్తున్నారు తప్ప గ్రామ అభివృద్ధికి వాడుకోవడం లేదు. వీధి దీపాలు లేక సందుల్లో గ్రామ ప్రజలు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



పడకేసిన పారిశుధ్యం



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు, అధికారులు

యాడికిలో తిరంగా ర్యాలీ

యాడికి : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఆదివారం యాడికిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజలు కలిసి భారతదేశ సైనిక బలాన్ని పెంచుకుని దేశాన్ని కాపాడేందుకు మన అందరి సహకారం అవసరమని నినదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ మండల అధ్యక్షుడు వేలూరు రంగయ్య, పరిమి చరణ్, ఎస్ఐ వెంకట రమణయ్య, నాయకులు రజక శేఖర్, గోపాలనాయుడు, శ్యామసుందర్ నాయుడు, చుక్కలూరు రామచంద్రారెడ్డి, నాగమునిరెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు వద్ది రాజశేఖర్, జనసేన మండల అధ్యక్షుడు కోడి సునీల్‌కుమార్, మురళీ, చాంద్, తెల్లాకుల వెంకటేష్, కొండ బాలచంద్రుడు, పోలీసులు పాల్గొన్నారు.

యోగాలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోండి

యల్లనూరు : రాష్ట్ర ప్రభుత్వ మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు చేపట్టిన యోగాంధ్రలో పాల్గొనేందుకు పేర్లు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ వాసుదేవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సాహంగా యోగాలో పాల్గొనాలనుకునే వారు మీ పరిధిలోని సచివాలయ సిబ్బందిని సంప్రదించి యోగా క్యూ ఆర్ కోడ్ ద్వారా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరం

యాడికి : తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా తాడిపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మండల టిడిపి నాయకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, నరసింహచౌదరి, చందు, ఫిరోజ్, కుళ్లాయిని యాడికి టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, తహశీల్దార్ ప్రతాపరెడ్డి, వాగ్దేవి కరస్పాండెంట్ శివప్రసాద్‌రెడ్డి, తదితరులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

సేవాలాల్ మహరాజ్‌ను దర్శించుకున్న నాయకులు



సేవాలాల్ మహరాజ్‌ను దర్శించుకుంటున్న కిడారి శ్రావణ్ కుమార్, రమేష్‌నాయక్, తదితరులు

పామిడి : గుంతకల్లు-గుత్తి మధ్యలో వెలసిన సంత్ సేవాలల్ మహరాజ్‌ను ఎపి రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. జిల్లా పర్యటనకు వస్తున్న ఆయన ఎపి గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్‌నాయక్‌తో సేవాలాల్‌ను దర్శించుకున్నారు. అనంతరం పలు సమస్యలపై చర్చింకున్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్, టిడిపి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రమణ నాయక్, మల్లికార్జున, సురేష్, శ్రీనివాసులు, రవి, చంద్రు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలకు బీమా పత్రాలు అందజేత



బీమా పత్రాలను అందజేస్తున్న జనసేన నాయకులు

గుత్తి : స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో జనసేన కార్యకర్తలకు ఆదివారం బీమా పత్రాలను నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన మండల, పట్టణ అధ్యక్షులు చిన్న వెంకటేశులు, పాటిల్ సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య మాట్లాడుతూ జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తించేలా పార్టీ అధినేత కె.పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వెంకటపతి నాయుడు, మిద్దె ఓబులేసు, శివ, శ్రీకాంత్, జయరాం, అల్లాబకాష్, వెంకటేష్, రమేష్, యగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రం సమీపంలో పెట్రోల్ బంకు వద్ద ఎస్ఐ వెంకట నరసింహ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలు దారులను ఆపి అధిక లోడుతో వెళు తున్న కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రైవింగ్ లైసెన్స్ రికార్డులు పరిశీలించి లేని వాహనాలకు అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఐ అనంతరం ఎస్ఐ వాహనదారులతో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలన్నారు. ఆటో వాళ్ల అధిక లోడుతో వెళ్లకుండా డ్రైవింగ్ లైసెన్స్ రికార్డులు ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వాహనదారుడితో మాట్లాడుతున్న ఎస్ఐ నరసింహ

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన చంద్రశేఖర్

పామిడి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఓ డాబా ఎదురుగా ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన వడ్ల చంద్రశేఖర్ (38) చీనీ, వేరుశనగ, వడ్ల వ్యాపారం చేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇందులో భాగంగానే పామిడి వాసి పిక్కిలి రామకృష్ణతో కలిసి గుంతకల్లు రూరల్ మండలంలోని నాగసముద్రానికి ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని అర్ధరాత్రి భోజనం కోసం పామిడి హైవేలోని శ్రీనిధి డాబాకు వచ్చారు. అప్పటికే డాబా మూసివేయడం గమణించి జాతీయ రహదారిలోని అనిమిరెడ్డి ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న రవి డాబా వద్దకు వచ్చారు. ఇక్కడ ద్విచక్ర వాహనంతో నిలబడి ఉండగా మద్యం మత్తులో కల్లూరు నుంచి ట్రాక్టర్‌లో వచ్చిన డ్రైవర్ తేజా వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో వడ్ల చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పామిడి ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు జమేదార్ రామాంజనేయులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న సంజీవరెడ్డి

బెలుగుప్ప : విద్యుదాఘాతంతో బోడుమల్లి సంజీవరెడ్డికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. సంజీవరెడ్డి సాయంత్రం ఎల్సి తీసుకుని తోటలో ఎలక్ట్రికల్ పోల్‌లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయి షాక్ గురై గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి హుటాహుటిన మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



సామూహికంగా యోగాసనాలు వేస్తున్న అధికారులు, పోలీసులు, చిన్నారులు

సామూహిక యోగాసనాలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం యోగా సాధన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన డిఎంహెచ్ఒ ఇబి.దేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకూ నిర్వహిస్తున్న యోగాంధ్ర వేడుకల్లో భాగంగా యోగాసనాల సాధన చేస్తున్నట్లు తెలిపారు. యోగాతో కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మానసిక ప్రశాంతతకు, ఒత్తిడి నియంత్రణకు కూడా ఎంతగానో దోహదపడుతుంద న్నారు. నిత్యం విధుల్లో తలమునకలై ఒత్తిడికి లోనయ్యే పోలీసు సిబ్బందికి యోగా బాగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులలో యోగా అత్యంత ప్రాధాన్యత సంచరించుకుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యోగాను గుర్తించి ఆచరిస్తున్నారన్నారు. ఒత్తిడి, ఆందోళనల నుండీ ఉపశమనం కల్గిస్తుందని... ప్రతీ ఒక్కరు మానసికంగా, భౌతికంగా దృఢత్వం కల్గి ఉంటారన్నారు. ఈకార్యక్రమంలో సిఐలు ధరణికిశోర్, హరినాథ్, రాజు, ఆర్ఐలు పవన్‌కుమార్, బాబు, ఎస్బీ సిసి ఆంజనేయప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, యోగా ఇన్‌స్ట్రక్టర్లు కృష్ణవేణి, గురురాజారావు, చలపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మదరసా వార్షికోత్సవం



ఆలీమ్ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులతో మదరసా నిర్వాహకులు

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని కణేకల్ రోడ్డులో ఉన్న జామియా మహమ్మదీయ అరబియా కాలేజ్ (మదరసా)లో ఆదివారం 99వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫారూక్ అబ్దుల్లా మదిని, షేక్ అబ్దుల్ వకీల్ మదిని, షేక్ అబ్దుల్ షమీమ్, అక్తర్ మదని, షేక్ అబ్దుల్ రాఫ్ జామయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలీమ్ కోర్సులో 31 మంది విద్యార్థులు ఆలిం కోర్సు, 10 మంది విద్యార్థులకు ఆఫీస్ కోర్స్ పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మదరసా కరస్పాండెంట్ సయ్యద్ హమీర్ అబ్బాస్, ప్రిన్సిపల్ అష్రాఫ్ ఫైజి, ఉపాధ్యాయులు అతవుర్ రహమాన్, అమీన్ మదని, సనావుల్లా, విద్యార్థుల కుటుంబ సభ్యులు, ముస్లిములు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి : సిఐటియు



సత్యసాయి కార్మికుడికి నివాలులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

విధుల నిర్వహణకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సత్యసాయి తాగునీటి పథకం కార్మికుడు మంగే సూరప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మృతిచెందిన కార్మికుడి ఇంటికి వెళ్లిన సిఐటియు నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లు పట్టణం ఆలూరు రోడ్డు వద్ద నివసిస్తున్న సత్యసాయి పథకంలో పని చేస్తున్న కార్మికుడి సూరప్ప విధులు నిర్వహణలో భాగంగా కొనకొండ్ల గ్రామంలో నీరు వదిలేందుకు శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎనుములు అడ్డంగా రావడంతో ప్రమాదం జరిగి మృతి చెందాడన్నారు. అయితే ఆర్‌డబ్ల్యుఎస్ సెక్రటరీగానీ, కలెక్టర్ కానీ స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మృతుని కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి తాగునీటి పథకం యూనియన్ నాయకులు చిన్న బాబయ్య, సిఐటియు నాయకులు తిమ్మప్ప, సురేంద్ర, రామాంజినేయులు, వెంకటాద్రి, సంతోష్‌కుమార్, యుగంధర్ బాబు, శివన్న, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక



సన్మానం అందుకున్న ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనంతపురం జిల్లా నూతన కమిటీని ఎనున్నకున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణప్రసాద్, కడప జిల్లా అధ్యక్షుడు రఘురాం నాయుడులు తెలిపారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా కృష్ణప్రసాద్, సహాయ ఎన్నికల అధికారిగా రఘురామ్‌నాయుడు వ్యవహరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా గోపీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాము నాయక్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరయ్య, అశోక్ బాబు, వెంకట్రాముడు, కలీం అహ్మద్, డాక్టర్ శివారెడ్డి, బి.శశిధర్‌రెడ్డి, సి.పౌల్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కేసీ నాగరాజు, జిల్లా జాయింట్ సెక్రెటరీలు హనుమంతు, వరప్రసాద్, చంద్రశేఖర్, భారతమ్మ, మహబూబ్ బాషా, ఆర్.వసంత, రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనతరం నూతన కార్యకవర్గాన్ని ఘనంగా సన్మానించి గజమాలలు, శాలువా, జ్ఞాపికలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎపిజిఇఎ జిల్లా కార్యాలయం వద్ద బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకుని కార్యవర్గం సంబరాలు చేసుకున్నారు. అంతకు మునుపు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపీకృష్ణ, రామునాయక్ మాట్లాడుతూ కెఆర్.సూర్యనారాయణ నేతృత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమాభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూ సంఘం బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

నాగేశ్వరరెడ్డి సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-అనంతపురం

ఆకాశవాణి, టూరిజం లలోని వివిధ శాఖల్లో పని చేసిన నాగేశ్వర్‌రెడ్డి పదవీ విరమణ చేయుచున్న సందర్భంగా అనంతపురంలోని ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్‌లో 'ఆత్మీయ సభకు' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, సీనియర్ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మూడు దశాబ్దాల పాటు ఆకాశవాణి, టూరిజంలో నాగేశ్వర్‌రెడ్డి ఎంతో సేవ చేశారని అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు.



నాగేశ్వరరెడ్డి దంపతులను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

పూర్వ విద్యార్థుల కలయిక



పామిడిలో ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 1999-2000 సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. అప్పట్లో వీరికి విద్యను బోధించిన గురువులతో కలిసి గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ముందుగా పాఠశాలలో సరస్వతి పూజ చేశారు. తర్వాత గ్రామంలో ర్యాలీగా జేసీ దివాకరరెడ్డి కల్యాణ మండపంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకరబాబు అధ్యక్షత సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యనేర్పిన గురువులను సన్మానించారు.

పామిడి : మండల కేంద్రంలోని టీ.సి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 1984 - 85వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. దాదాపు 40 ఏళ్ల తరువాత అందరూ కలుసుకోవడంలో ఒకరి క్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. అనంతరం వారికి విద్యాబోధన చేసిన గురువులను ఊరేగింపుగా తీసుకొని వచ్చి జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమరేంద్ర, తిరుపాలు, పి.డి. గోపాల్, హెచ్ నారాయణరావు, గోపాల్ రెడ్డి, నాగేష్,శ్రీనివాసులు, రాజశేఖర్,రఘునాథ్ శర్మ, శేషగిరి, మునిస్వామి, సతీష్ కుమార్, శ్రీనివాసులు, సదానంద బాబు, వెంకటేశ్వరరావు, పులి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాతిదూలం లాగుడు పోటీలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని ఆవులాంపల్లిలో మూడురోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దులచే రాతిదూలం లాగుడు పోటీలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు సీనియర్ విభాగానికి సంబంధించిన పోటీలకు 12జతల ఎద్దులు పాల్గొనగా మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్రం హుజూరునగర్కు చెందిన బొరెడ్డి కేశవరెడ్డి, సుకిందర్ రెడ్డిల వృషణాలు 3915 అడుగులు లాగి రూ.1.2లక్షల బహుమతిని పొందారు. ద్వితీయస్థానంలో కడప జిల్లా చౌటుపల్లి (అహోబిలం, కారంజేయ) గ్రామాలకు చెందిన చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 3703 అడుగులు లాగి రూ.1లక్ష బహుమతిని అందుకోగా, తృతీయ స్థానంలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన రోహన్ బాబు ఎద్దులు 3468 అడుగులు లాగి రూ.80వేలు బహుమతి పొందాయి. నాలుగో స్థానంలో నంద్యాల జిల్లా హుసేనాపురానికి చెందిన రామసుబ్బారెడ్డి ఎద్దులు 3357 అడుగులు లాగి రూ.60వేలు బహుమతి అందుకున్నాయి. మిగిలిన ఆరు బహుమతులను కూడా నిర్వాహకులు అందజేయగా మొదటి బహుమతిని పొందిన ఎద్దులకు వెంకటాంపల్లికి చెందిన దేవన రమేష్ రెడ్డి, చిలుమూరి కుమార్‌రెడ్డి అనే వ్యక్తులు గోమాతను బహుమతిగా ఇచ్చారు. పోటీ నిర్వహణలో వ్యాఖ్యాతలుగా రవిచంద్రారెడ్డి, నారాయణస్వామి, సురేష్ వ్యవహరించారు.



భోజనం అందజేస్తున్న పాస్టర్

అన్నదానం

అనంతపురం : నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న ఎస్ఐయుసి టౌన్ కాంగ్రిగేషనల్ చర్చిలో ఆదివారం ఉచిత భోజన సహవాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవ సంపత్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కమిటీ ఆధ్వర్యంలో చర్చిలో పోగు చేసిన కానుకల ద్వారా ప్రతి ఆదివారం చర్చి ఆవరణలోనే పేదలకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జే జాకోబ్, సెక్రటరీ ప్రావిన్స్ ప్రభాకర్, ట్రెజరర్ పీఎస్ విజయకుమార్, యూత్ డీకెన్ నలమల విల్సన్ మరియు సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి

పుట్లూరు : ఈనెల 27, 28, 29వ తేదీల్లో కడపలో నిర్వహించనున్న మహానాడుకు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం వద్ద ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు, సౌధామణి భర్త నరసింహయ్య వర్ధంతిని పురస్కరించుకుని కుమార్తె వాణిశ్రీ అన్నదానానికి సహకరించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ఎంతో పుణ్యంతో కూడుకున్న విషయమన్నారు. మన మధ్య ఉండి మనకి దూరమైన వ్యక్తుల జ్ఞాపకార్థం పేదల ఆకలి తీర్చడం వల్ల దూరమైన వ్యక్తుల ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు. ఆకలి అన్నవారికి అన్నం పెట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు లక్ష్మీదేవి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి